క్లుప్తంగా

వీఎస్‌యూ వీసీ నివాళి



వెంకటాచలం: ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన సోమిశెట్టి మధుసూదన్‌కు విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత గురువారం నివాళులర్పించారు. కావలి పట్టణానికి వెళ్లి మధుసూదన్ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీబీఆర్ విద్యార్థుల ప్రతిభ



ముత్తుకూరు: పది పరీక్ష ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై రికార్డు సృష్టించారని ముత్తుకూరులో వీబీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ శైలజారెడ్డి తెలిపారు. 593 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించిన వాకాటి నేత్ర, 590 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన దాసరి హేమంత్‌ను గురువారం అభినందించి నగదు రివార్డు అందజేశారు. వారు మాట్లాడుతూ, 80 మందిలో 29 మంది 550పైగా, 56 మంది 500పైగా మార్కులు సాధించారన్నారు. సోషల్లో 11 మంది, తెలుగులో ముగ్గురు, గణితంలో ఒకరు వందకు వంద మార్కులు సాధించారని వెల్లడించారు. ప్రిన్సిపల్ కేఆర్ రమేష్, మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణం సీజ్

- కొత్తూరులో విజిలెన్స్ అధికారుల దాడులు



తనిఖీలు చేపడుతున్న అధికారులు

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో 42వ నంబర్ రేషన్‌షాపుపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించి 1,275 కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అవకతవకలు పాల్పడిన నేపథ్యంలో ఆ షాపును సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. నిల్వ ఉన్న సరుకులను స్థానిక వీఆర్వోకు అప్పగించారు. కాగా షాపు నిర్వాహకులపై లబ్ధిదారులు తహసీల్దారుకు ఫిర్యాదు చేసి ఉన్నారు. ఈ క్రమంలో దాడుల్లో అవకతవకలు బయట పడడంపై చర్చనీయాంశంగా మారింది.


కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న బీజేపీ నేతలు

ఇందుకూరుపేట: పహల్గాం వద్ద ఉగ్రదాడిలో ప్రాణాలు వదిలిన అమాయకుల ఆత్మశాంతి కోసం మండలంలోని కొరుటూరులో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షులు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు గాంధీ, రామలింగయ్య, మొగలయ్య, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామి పల్లకి సేవ నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో నివాసం ఉంటున్న చాగంటి శివయ్య బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ సమస్యను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాధిత కుటుంబానికి రూ.4,95,000ల చెక్కును ప్రశాంతిరెడ్డి ఆమె నివాసంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు.

నాడు - నేడుతో మారిన రూపురేఖలు

- పదిలో సత్తా చాటిన డీఎన్నార్ విద్యార్థినులు
- మండల స్థాయిలో అత్యధిక మార్కులు
- గత ప్రభుత్వంలో స్కూల్ అభివృద్ధికి చర్యలు



విద్యార్థిని శ్రీజను సన్మానిస్తున్న టీచర్లు

పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఏటా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటుతున్నారు. ఉత్తీర్ణత శాతం అటూఇటుగా ఉన్నా మండలంలో ప్రథమ స్థానంలో నిలుస్తున్నారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతోపాటు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉంటున్నాయి. గతంలో మనబడి నాడు - నేడు పథకంలో భవన నిర్మాణంతో పాటు ఇక్కడ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడంతో ఫలితాలు మెరుగు పడ్డాయి. జిల్లాలో విద్యార్థినుల సంఖ్యలో ఇది రెండో స్థానంలో ఉంది. గతేడాది ఉత్తీర్ణత శాతంతో పోల్చి చూస్తే ఈసారి కొంత తగ్గింది.

85.61 శాతం

పాఠశాలలో మొత్తం 700 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. 139 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 119 ఉత్తీర్ణులయ్యారు. 85.61 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకొచ్చారు. స్కూల్లో మొత్తం 24 మంది ఉపాధ్యాయినులున్నారు. క్రమశిక్షణతో పాఠ్యాంశాలు బోధించడంతో మంచి ఫలితాలు సాధించగలిగారు.

మండలంలో..

ఇక్కడ పది చదివిన విద్యార్థినులు మండలంలో అత్యధిక మార్కులు సాధించడం విశేషం. గతేడాది స్నేహిత 576, హిమవర్షా 570, లిఖిత 562 మార్కులు సాధించి మేటిగా నిలిచారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపారు. ఫలితంగా ఈ ఏడాది టెన్త్‌లో పిల్లల సంఖ్య 139కి పెరిగింది. సాయిదేవిక 591, సుమసాయిచరిత 586, శ్రీజ 580 మార్కులు సాధించారు. సాయిదేవిక మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెకు సీఏ చదవాలనే ఆసక్తి ఉన్నట్టు వెల్లడించారు. ఈ పాఠశాల నుంచి మూడేళ్లలో ట్రిపుల్ ఐటీకి కూడా విద్యార్థినులు ఎంపిక కావడం విశేషం.

మంచి ఫలితాలు సాధిస్తున్నాం



మా పాఠశాల నుంచి టెన్త్‌లో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. మంచి టీచర్లు ఉండటం వల్ల పిల్లలు చక్కగా చదువుకోగలుగుతున్నారు. నేను నెలాఖరుకు రిటైర్డ్ అవుతున్న సమయంలో మంచి ఫలితాలు రావడం సంతోషంగా ఉంది.

– ఫెర్సిస్, హెచ్ఎం, డీఎన్నార్ జెడ్పీ బాలికల హైస్కూల్, పొదలకూరు

పాడి రైతులకు మేలు చేయండి



పశుసంవర్ధక శాఖ ఏడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరు: నియోజకవర్గంలో పాడి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో పశుసంవర్ధక శాఖ ఏడీలు, పశువైద్యశాల డాక్టర్లతో ఆమె గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న పశువుల దానాపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ప్రస్తుతం మండలానికి 5.6 టన్నుల ఫీడ్ అందనుందని అధికారులు ఆమె దృష్టికి తెచ్చారు. ఒక్కో పాడి రైతుకు ఒక బ్యాగ్ చొప్పున అందిస్తామని వివరించారు. పశువుల దానాకు సంబంధించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి మండలానికి ఫీడ్ అందేలా చూడాలన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న దానాపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన మినీ గోకులాల పురోగతిపై ఆరా తీశారు. వీటిని త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు పశుసంవర్ధక ఏడీలు మురళీకృష్ణ, ప్రసన్నాంజనేయరెడ్డి, కృష్ణమౌర్య, పశు వైద్యశాలల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసిన అధికారులు

ముత్తుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గండవరం సుగుణ, ఎంపీడీఓ నాగమణి తదితరులు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగాలంటే పంచాయతీలు బలోపేతం కావాలన్నారు. పన్నుల వసూళ్ల ద్వారా పంచాయతీలను పరిపుష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఎస్‌లో చేరికకు సర్టిఫికెట్లు సమర్పించాలి

కొడవలూరు: మండలంలోని చంద్రోశేఖరపురం ఈఎంఆర్ఎస్‌లో ఆరో తరగతిలో చేరికకు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన బాల బాలికలు ఈనెలాఖరులోగా సంప్రదించి సంబంధిత సర్టిఫికెట్లను సమర్పించాలని ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ గురువారం తెలిపారు. ఇక్కడి ఈఎంఆర్ఎస్‌లో బాలికలకు-30, బాలురకు-30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా యానాది, ఎరుకుల, నక్కల, సుగాలి తదితర గిరిజన తెగల విద్యార్థులకు కేటాయింపు ఉంటుందన్నారు. పది శాతం సీట్లు కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన, అంగవైకల్యం ఉన్న పిల్లలకు కేటాయిస్తామన్నారు.

సాగునీటి సంఘాలతో ఆర్డీఓ సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

నెల్లూరు సిటీ: రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో డబ్ల్యూయూఏ (సాగునీటి సంఘాలు) చైర్మన్‌లు, డిస్ట్రిబ్యూషన్ కమిటీ సభ్యులతో ఆర్డీఓ అనూష నీటి పన్ను మాడ్యూల్ సేకరణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాన్ని బట్టి బకాయిలు చెల్లించేందుకు డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతిఒక్కరూ సచివాలయాల వద్ద నీటి పన్ను చెల్లించాలని కోరారు. తహసీల్దార్‌లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు చెక్



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఎంహెచ్ఓ సుజాత, డీఎంఓ హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్) : దోమల నివారణతోనే మలేరియాను అరికట్టవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుజాత, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వాల్ పోస్టర్లు, కరపత్రాలను వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమకాటు వల్ల ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సీపరమ్ అనే పారాసైట్స్ మనిషిలోకి ప్రవేశించి మలేరియా జబ్బును కలిగిస్తాయన్నారు. కాగా శుక్రవారం వైద్యశాఖ కార్యాలయం నుంచి జరిగే ర్యాలీ, అవగాహన సదస్సులో డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొనాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డాక్టర్ దయాకర్, అసిస్టెంట్ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ

పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి గ్రామం నిమ్మతోటల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని వైరును దొంగలు బుధవారం రాత్రి చోరీ చేశారు. ఈ మేరకు నిమ్మతోట రైతు శేషారెడ్డి విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి లోపల ఉన్న రాగితీగలను అపహరించారు. చోరీ వల్ల రైతులు నిమ్మతోటలకు నీరు పెట్టుకునేందుకు ఇబ్బందిగా మారింది.

చేపల వేలం వాయిదా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కనిగిరి రిజర్వాయర్‌లో శుక్రవారం జరగాల్సిన చేపల వేలంపాటను వాయిదా వేశామని బుచ్చిరెడ్డిపాళెం మత్స్యశాఖ అధికారి పొట్టియ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

28 నుంచి సమ్మర్ క్యాంప్

నెల్లూరు(బృందావనం): మినీ బైపాస్‌రోడ్డు దగ్గర ఇస్కాన్ మందిరంలో బాలలకు ఈనెల 28 నుంచి మే 2వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖ్‌దేవ్‌స్వామి గురువారం తెలిపారు. ఆరు నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, పఠనం, వేదాల నుంచి సృజనాత్మక కథలు, కీర్తనలు, డ్రాయింగ్, వేదాలకు సంబంధించిన క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 88866 63140, 96876 32229 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలి

నెల్లూరు(అర్బన్): 60 ఏళ్లు నిండిన వారి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీనియర్ సిటిజన్ కార్డులను మీ-సేవా కేంద్రాలు, జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారా పొందవచ్చని మీ-సేవ, ఈ-సేవ ఫ్రాంఛైజర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎస్.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాయితీతోపాటు పాస్‌పోర్టు సేవా ఫీజుల్లో రాయితీ పొందవచ్చన్నారు. కోర్టు కేసుల విచారణలోనూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అదనపు వడ్డీ వస్తుందన్నారు. రైల్లో ప్రత్యేక సదుపాయంతోపాటు పన్ను మినహాయింపులు కూడా ఉంటాయన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ క్యాంప్

నెల్లూరు(అర్బన్): స్థానిక ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో 15 ఏళ్లలోపు బాల, బాలికల కోసం ఏర్పాటు చేసిన న్యూరో మెడికల్ క్యాంప్‌తో ఎంతో ఉపయోగకరమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి అన్నారు. మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ ఎంఎస్సార్ స్పాస్టిక్ సెంటర్‌లో ఆక్యుపేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, కౌన్సెలింగ్ మెడికల్ క్యాంపును గురువారం నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎదుగుదల లోపాలు సరిదిద్దేందుకు, బ్రెయిన్ చికిత్స, బలహీనపడిన నరాలను సరిదిద్దేందుకు డాక్టర్లు వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. న్యూరోజన్ బ్రెయిన్, స్పైన్ ఇన్‌స్టిట్యూట్ -ముంబై వారి ఆధ్వర్యంలో డాక్టర్లు సుచితాచౌదరి, సుశీల్ వైద్య చికిత్సలు అందించారు. 70 మంది పిల్లలను పరీక్షించి 40 మందిని మెరుగైన చికిత్సల కోసం రెఫర్ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు జనార్దనరాజు, సురేష్‌కుమార్‌జైన్, రాజేంద్రప్రసాద్, ఎంవీ సుబ్బారెడ్డి, బలరామయ్యనాయుడు, రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతానికి కృషి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఈనెల 30వ తేదీ ప్రారంభంకానున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతం చేసేందుకు సమష్టి కృషి చేయాలని వీసీ అల్లం శ్రీనివాసరావు సూచించారు. వర్సిటీల్లో గురువారం బోధన, బోధనేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల నుంచి ప్రతినిధులు వస్తారన్నారు. క్రీడా ప్రాంగణాలు, హాస్టల్ వసతులు, భద్రత, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలియజేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయిన మధుసూదన్‌కు నివాళులర్పించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సీహెచ్.వెంకట్రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫాంహౌస్‌లో చోరీకి యత్నం

- బైక్ వదిలేసి దొంగల పరార్



ఆగంతకులు వదిలెళ్లిన బైక్

పొదలకూరు: మండలంలోని ఉలవరపల్లి గ్రామం వద్ద జామాయిల్ తోటలో ఉన్న ఫాంహౌస్‌లో బుధవారం రాత్రి చోరీ యత్నం జరిగింది. పోలీసులు, ఫాంహౌస్ యజమాని కథనం మేరకు వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన సుబ్బారావుకు ఉలవరపల్లిలో పొలాలున్నాయి. ఆయన వచ్చిన సమయంలో ఉండేందుకు ఇంటికి నిర్మించుకున్నాడు. మూడు నెలల క్రితం ఫాంహౌస్‌లో బిగించిన ఏసీ, పొలాలకు సంబంధించిన మూడు విద్యుత్ మోటార్లు చోరీకు గురయ్యారు. అప్పట్లో సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వారు రెండు బైక్‌లపై ఫాంహౌస్ వద్ద చోరీ యత్నానికి పాల్పడినట్టు సమాచారం. తోటలో కాపల ఉన్న గిరిజనులు అదే సమయంలో అక్కడికి వెళ్లడంతో ఆగంతకుల్లో ఒకరు బైక్ వదిలి పరారయ్యాడు. గురువారం ఆ బైక్‌ను తోట యజమాని సుబ్బారావు కాపలాదారులు కలిసి పోలీస్‌స్టేషన్లో అప్పగించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎస్కే హనీఫ్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు లాభాలు



మాట్లాడుతున్న సత్యవాణి

మనుబోలు: ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా రైతులు మంచి లాభాలు గడించవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి అన్నారు. ప్రత్యామ్నాయ పంటలు, మట్టి నమూనాల సేకరణ తదితర విషయాలపై మనుబోలులో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎడగారు సీజన్‌లో మినుము, పెసర, నువ్వు, పత్తి తదితర పంటలను సాగు చేసుకుంటే నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. అలాగే పొలాల్లో మట్టి నమూనాలను తీయించి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల ఎలాంటి పంటలు సాగు చేయాలి, ఏ పోషకాలు అందించాలనే విషయం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజి, శివనాయక్, మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



స్టేట్ ర్యాంకర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు: పది పరీక్షల్లో 597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించిన మండలంలోని గుండాలమ్మపాళేనికి చెందిన పల్లంరెడ్డి ఇందుప్రియను స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని వారి నివాసంలో గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ విద్యార్థిని రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

భూసార పరీక్షలతో ఉపయోగకరం



భూసార పరీక్షల పత్రాలను చూపుతున్న రైతులు

కొడవలూరు: భూసార పరీక్షలు ఎంతో ఉపయోగకరమని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని దామేగుంట, తలమంచి గ్రామాల్లో భూసార పరీక్షలపై రైతులకు ప్రయోగాత్మకంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల నేల స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు. నేల స్వభావం తెలియకుండా ఇబ్బడిముబ్బడిగా ఎరువులను వినియోగించడం వల్ల సాగు ఖర్చు గణనీయంగా పెరగడంతో పాటు దిగుబడి సాధించలేకపోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏలు ఎస్.ప్రసాద్, బి.లిఖిత, సర్పంచ్ వై.భాస్కర్‌రావు, జెడ్పీఎన్ఎఫ్ ప్రతినిధి శ్రీకాంత్, నాయకుడు జి.కృష్ణయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్లు



మల్లూరు వద్ద శిథిలమైన బస్ షెల్టర్



పీవీ కండ్రిగ రోడ్డులో ఇలా..

ముత్తుకూరు: ప్రయాణికులకు నీడనిచ్చే బస్ షెల్టర్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి. గతంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన షెల్టర్లు ఇప్పుడు శిథిలమై అధ్వానంగా మారాయి. ముఖ్యంగా నెల్లూరు - ముత్తుకూరు రోడ్డులో పాటూరువారికండ్రిగ, రంగాచార్యులకండ్రిగ, మల్లూరు, బ్రహ్మదేవి, గోపాలపురం, లింగాయపాళెం గ్రామాల వద్ద నిర్మించిన బస్ షెల్టర్లు పూర్తిగా నిరుపయోగమయ్యాయి. వేసవిలో ప్రయాణికులకు నీడ కల్పించాల్సిన షెల్టర్లు ప్రస్తుతం అడుగు పెట్టలేని దుస్థితికి చేరాయి. అలాగే గుంటకట్ల, ఈదులవారిపాళెం, గోవిందరెడ్డిపాళెం, పిడతాపోలూరు, పైనాపురం గ్రామాల్లోని షెల్టర్లు దుస్థితిలో ఉన్నాయి. అనాథలు, భిక్షాటన చేసేవారికి నెలవుగా మారాయి.

26న డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఈనెల 26న జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తడ, చెన్నై, శ్రీసిటీ ప్రాంతాలకు చెందిన పలు కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరు కానున్నట్లు చెప్పారు. వయస్సు 27 ఏళ్లలోపు కలిగి పదో తరగతి, ఇంటర్ అర్హత కలిగిన యువతీ, యువకులు తమ రెజ్యూమ్‌లతో పాటు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 90306 65477 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.